క్లుప్తంగా

కలెక్టర్‌కు వినతి

మహబూబాబాద్: ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌లో జాతీయ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం సరికాదని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కె.శశాంకకు వినతి ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరన్న, యాకయ్య తదితరులు పాల్గొన్నారు. మానుకోట సోషల్ వెల్ఫేర్ బాలికల కళాశాల, నర్సింహులపేట గురుకుల పాఠశాలను అప్‌గ్రేడ్ చేయగా వాటిల్లో గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగాల విషయంలో నిబంధలకు వ్యతిరేకంగా పోస్టులు భర్తీ చేసిందని విచారణ చేసి చర్య తీసుకోవాలని జిల్లా కేంద్రానికి చెందిన మంద శశికుమార్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశాడు.

మున్సిపల్ చైర్మన్‌కు సత్కారం



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణ బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డిని కుమ్మరి బొడ్డుపల్లి వంశీకుల, ముత్యాలమ్మ పూజారుల కుటుంబం తరఫున ఘన సత్కారం చేశారని మా అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డుపల్లి ఉపేంద్రం సోమవారం తెలిపారు.

కనులపండువగా లింగమంతుల జాతర



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని అమనగల్ గ్రామంలో లింగమంతుల జాతర పూజా కార్యక్రమాలను సోమవారం కనుల పండువగా నిర్వహించారు. రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతరకు భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. హైదరాబాద్ మహానగర పాలక సంస్థ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ సతీమణి, చర్లపల్లి మున్సిపల్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ జాతరలో లింగమంతుల స్వామివారిని దర్శనం చేసుకుని బోనం సమర్పించారు. జెడ్పీటీసీ లూనావత్ ప్రియాంక, తేళ్ల శ్రీనివాస్, నూకల శ్రీకాంత్, లూనావత్ అశోక్, తేళ్ల రమేష్, కావటి జనార్దన్, రాయల సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

పరికరాల బహూకరణ



డోర్నకల్: మండలంలోని చిలుకోడు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు ఖమ్మం నగరానికి చెందిన 14వ డివిజన్ కార్పొరేటర్ కూరాకుల వలరాజు రూ.10వేలు విలువైన పరికరాలను బహూకరించాడు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోసంపదతో రైతులకు మేలు



పెద్దవంగర: మానవ మనుగడకు ఎంతో ఉపకరించే గోసంపదతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. సోమవారం మండలంలోని అవుతాపురం గ్రామంలో 10 మంది రైతులకు లేగ దూడలను సర్పంచ్ సల్లెండి మంజుల సుధాకర్ సమక్షంలో రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొమురంభీమ్ జిల్లా గోసంరక్షణ సమితి అధ్యక్షురాలు దుర్గం రోజా, తెలంగాణ గోశాల ప్రతినిధి కిరణ్, భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

గార్ల: మండలంలోని చిన్నబంజర పంచాయతీ పరిధిలోని తుమ్మకుంటలో సోమవారం ఉపాధి పనులను సర్పంచ్ ఉషాబాలునాయక్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు తరుణ్, నరేష్, ప్రసాద్, కార్యదర్శి మంగీలాల్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలను పెంచాలి

కేసముద్రం: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రైస్‌మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను వెంటనే పెంచాలని ఐఎఫ్‌టీయూ నాయకులు శివారపు శ్రీధర్ డిమాండ్ చేశారు. కేసముద్రంలో రైస్‌మిల్లు డ్రైవర్స్, కార్మికులు తమ వేతనాలను పెంచాలంటూ చేపట్టిన సమ్మె సోమవారం నాటికి ఆరో రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు శ్రీను, వెంకన్న, రహిమాన్, అబీబ్, ఎల్లయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అంకెల గారడిగా రాష్ట్ర బడ్జెట్



తొర్రూరులో మాట్లాడుతున్న కొత్తపల్లి రవి



కేసముద్రం: ప్రతులను దహనం చేస్తున్న నాయకులు



తొర్రూరు: మాట్లాడుతున్న రాంచందర్‌రావు

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ అంకెల గారడిగా ఉందని ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలో ప్రజాపంథా పార్టీ సమావేశం నిర్వహించారు. రవి మాట్లాడుతూ.. రైతాంగానికి రుణమాఫీ చేసేందుకు కేటాయింపులు లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ కార్యదర్శి వీరన్న, నాయకులు వెంకటేశ్వర్లు, పాపారావు, సంతోష్, రమేష్ పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత

కేసీఆర్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు పెదగాని సోమయ్యతో కలిసి రాంచందర్‌రావు మాట్లాడారు. పేదల నడ్డి విరిచేలా బడ్జెట్ ఉందన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి అన్ని ప్రాంతాల్లో స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్‌రెడ్డి, సురేష్, రామ్మోహన్‌రెడ్డి, రచ్చకుమార్, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

కేసముద్రం: శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 6.57 శాతం మాత్రమే నిధులను కేటాయించి, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతకాని రాకేష్ విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేసి ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ కాకతీయ యూనివర్సిటీ సెక్రటరీ శ్రావణ్, దేవేందర్, మనోహర్, ఆకాశ్, చందు, రాకేష్, నరేందర్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం

బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఎస్.అశోక్‌స్టాలిన్ సోమవారం విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని అనేక నివేదికలు చెబుతున్నాయని తెలిపారు.

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరానికి సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన కేటాయింపులు చేయకపోవడం విద్యపై నిర్లక్ష్యాన్ని సూచిస్తుందని టీపీటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి చుంచు శ్రీశైలం, పులిచింత విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం విద్యకు 12శాతం బడ్జెట్ కేటాయించాలన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమానికి బడ్జెట్‌లో కూడా ప్రత్యేక నిధులు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు మొండిచేయి

నెల్లికుదురు/సెంటర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు తక్కువ నిధులు కేటాయించి మొండి చేయి చూపారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ సమాజం తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

వలంటీర్లకు అభినందనలు

మహబూబాబాద్ రూరల్: బొడ్రాయి ఉత్సవాల్లో సేవలు అందించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లను మహబూబాబాద్ టౌన్ సీఐ సతీష్ సోమవారం అభినందించారు. జీడీసీ ప్రిన్సిపాల్ రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, రత్నమాల, అధ్యాపక బృందం కూడా అభినందనలు తెలిపారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు

నెల్లికుదురు/సెంటర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర సందర్భంగా మహబూబాబాద్ ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు కలిసి సోమవారం వినతిపత్రాన్ని అందించినట్లు ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరినాయక్ తెలిపారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరినట్లు హరినాయక్ తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

దంతాలపల్లి: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం సర్పంచ్ నెహ్రూ నాయక్ తొర్రూర్‌లోని శ్రీ సాయి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ సోమవారం ఆయన్ను పరామర్శించాడు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, తదితరులు ఉన్నారు.

ప్రాజెక్ట్ పనులను అడ్డుకుంటాం



వినతిపత్రం ఇస్తున్న రైతులు

డోర్నకల్: తమ భూములకు నష్టపరిహారం చెల్లించకుంటే సీతారామా ప్రాజెక్ట్ నిర్మాణ పనులను అడ్డుకుంటామని డోర్నకల్, బుద్ధారం, పుల్లూరు గ్రామాలకు చెందిన రైతులు హెచ్చరించారు. సోమవారం ఖమ్మంలోని ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించేందుకు ప్రైవేటు వాహనాల్లో పెద్ద ఎత్తున ఖమ్మం తరలివెళ్లారు. అనంతరం డోర్నకల్ తహసీల్దార్ కార్యాలయంలో రైతులకు వినతిపత్రం సమర్పించారు. భూములకు సంబంధించి పరిహారం ఇవ్వకుండా మూడేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ గార్ల, నాయకులు కందునూరి శ్రీనివాస్, బొమ్మన అశోక్‌కుమార్, రైతులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, లోకేశ్, నంద్యానాయక్, రమేష్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే వేతనాల పెంపు

గార్ల: సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచినట్లు సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, నాగమణి, అనసూయ, విజయ, పద్మ, సావిత్రి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

మరిపెడ రూరల్: శుభకార్యాలు, పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని వాటి గుర్తుగా ప్రతి ఒక్కరూ మొక్కను నాటి సంరక్షించుకోవాలని జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు జర్పుల కాలునాయక్ అన్నారు. మండలంలోని బాల్యతండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన పుట్టినరోజు పురస్కరించుకొని గ్రామస్తులతో కలిసి సోమవారం మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బానోతు హరినాయక్, ఎంపీటీసీ జిక్కినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రకృతి వనాన్ని రక్షించాలి

కురవి: మండలంలోని మోద్గులగూడెంలోని పల్లెప్రకృతి వనాన్ని రక్షించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాజా అన్నారు. సోమవారం గ్రామంలోని పల్లెప్రకృతి వనంలో చెట్లు, మొక్కలు పరిశీలించారు. కార్యక్రమంలో రడం గౌరమ్మ, ధరావత్ రమేష్, మహేష్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆదేశాలను ఉపసంహరించుకోవాలి



డోర్నకల్: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

డోర్నకల్: అటవీ సంరక్షణ నియమాలు 2022ను వెంటనే రద్దు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు యాసా వెంకటనారాయణ డిమాండ్ చేశారు. అటవీ సంరక్షణ నియమాలను రద్దు చేసి ఆదివాసులను అడవుల నుంచి ఖాళీ చేయాలని అధికారులు జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ స్వాతిబిందుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తాజ్‌పాషా, పొన్నం శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కురవి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అటవీ సంరక్షణ నియమాలను వెంటనే రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె బాబన్న అన్నారు. సోమవారం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహసీల్దార్ ఇమ్మానియేల్‌కు అందజేశారు. కార్యక్రమంలో తాజ్‌పాషా, భిక్షపతి, రవీందర్, రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా..



పెద్దవంగర: బాణసంచా కాల్చుతున్న నాయకులు

పెద్దవంగర: బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. శాసన సభలో బలహీన వర్గాల సంక్షేమానికి అధిక మొత్తంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ సోమవారం మండల కేంద్రంలోని టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కేతిరెడ్డి సోమనర్సింహారెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, మనోహర్, సర్పంచ్‌లు భాస్కర్, భీమా, ముజీబ్, నాయకులు సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం రూ.2.90లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో పార్టీ ఆధ్వర్యంలో టపాసులు కాల్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, నాయకులు లింగాల వెంకటనారాయణగౌడ్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న చైర్మన్ వీరన్న

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డులలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. డోర్నకల్ మున్సిపాలిటీకి సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.25కోట్లతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అభిప్రాయ సేకరణ కోసం మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. చైర్మన్ వీరన్న మాట్లాడుతూ.. తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం, విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిధులు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, నాయకులు అప్పారావు, వెంకటేశ్వర్లు, తారాచంద్ పాల్గొన్నారు.

అధికారులపై చర్య తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

గూడూరు: మండలంలోని గుండెంగ, తేజావత్‌రాంసింగ్‌తండా గ్రామాలలో పోడు సర్వే చేస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలని ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బోడ కిషన్‌నాయక్, రాంసింగ్‌తండా సర్పంచ్ మంగీలాల్‌నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం రెండు గ్రామాల గిరిజన రైతులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇస్తామంటుంటే, సర్వే కోసం గ్రామాలకు విచ్చేస్తున్న అధికారులు ముడుపులు ఇచ్చిన వారికి భూములను రాస్తూ, ఇవ్వని వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

పాదయాత్రను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న నెహ్రూనాయక్

కురవి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్రను మేడారం సమ్మక్క–సారక్క ఆలయం నుంచి చేపడుతున్న పాదయాత్రను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలని డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు, టీపీసీసీ సభ్యుడు మాలోత్ నెహ్రూనాయక్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం కురవిలో నిర్వహించారు. కార్యక్రమంలో రంగన్నగౌడ్, మహేందర్‌రెడ్డి, లాలునాయక్, రాజ్‌పుత్‌నాయక్, జగదీష్, వెంకన్న, హరిలాల్, నవీన్, రాందాస్ పాల్గొన్నారు.

పాదయాత్ర విజయవంతం కావాలని పూజలు

మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్ర స్వామి ఆలయలో సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మేడారం నుంచి చేపడుతున్న పాదయాత్ర విజయవంతం కావాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు రాంచందర్‌నాయక్, వీరభద్రం, నారాయణ రాజేందర్‌కుమార్ పాల్గొన్నారు.

నంది అవార్డుల ప్రదానం



తొర్రూరు రూరల్: అవార్డు అందుకుంటున్న సంపత్



గూడూరు: అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

తొర్రూరు రూరల్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో అనేక ఆటపాటలతో ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు ఎంతో కీలకంగా వ్యవహరించిన మండలంలోని కంఠాయపాలెం గ్రామానికి చెందిన కళాకారుడు బొల్లికొండ సంపత్‌కు నంది అవార్డు దక్కింది. సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమ కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం సంపత్ అవార్డు అందుకున్నాడు.

గూడూరు: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారుడిగా, గాయకుడిగా చురుకైన పాత్ర పోషించిన మండలంలోని పొనుగోడుకు చెందిన పెరుమాండ్ల శ్రీనివాస్‌ను ప్రభుత్వం ఉద్యమ గాయకుడిగా గుర్తించి నంది అవార్డు అందించింది. హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం తెలంగాణ ఉద్యమ కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉత్తములకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం..

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



డోర్నకల్: మండలంలోని రాముతండా నుంచి గార్ల మండలం పులిగడ్డతండా వరకు ఏర్పాటు చేస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. రూ.49లక్షల సీఆర్ఆర్ నిధులతో 1.14కిలోమీటర్ల దూరం నిర్మించే రోడ్డు పనులకు ఎంపీటీసీ సభ్యులు భూక్యా శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ సఫ్దర్ అలీ, బీఆర్ఎస్ నాయకులు రామనాథం, గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సెలవు రోజుగా ప్రకటించాలి

గార్ల: బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని సేవాలాల్ సేన ఇల్లందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలోత్ శివనాయక్ సోమవారం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కిషన్, మోతీలాల్, సాయి, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

చిన్నగూడూరు: కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. సోమవారం మండలంలోని జయ్యారం ఆరోగ్య ఉపకేంద్రంలో కంటి వైద్య శిబిరం కొనసాగింది. కార్యక్రమంలో కంటి వెలుగు ప్రోగ్రాం ఆఫీసర్ కరుణాకర్, ఏఎన్ఎంలు శ్యామల, సిబ్బంది తదితరులు ఉన్నారు.

శ్రీశైలం బయలుదేరిన శివభక్తులు

దంతాలపల్లి: మండలంలోని దాట్ల గ్రామంలో 32మంది శివ భక్తులు 42 రోజులపాటు భక్తిశ్రద్ధలతో ఉపవాసముండి ఇరుముడి సమర్పించడానికి సోమవారం శ్రీశైలం బయలుదేరారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన

డోర్నకల్: ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేణుమాధవ్ కోరారు. స్థానిక గాంధీ సెంటర్‌లో సోమవారం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ జానపద కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, సీహెచ్‌ఓ వీరబాబు, కుమారస్వామి, కళాకారులు నమోజ, వెంకటాద్రి, సురేష్, రాజేష్, రాజు, కర్ణాకర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దంతాలపల్లి: దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం సర్పంచ్ గుగులోత్ నెహ్రూనాయక్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా విషయం తెలుసుకున్న గ్రామ ప్రజలు సోమవారం రూ.40,600 ఆర్థికసాయం చేశారు.

కారు, బైక్ ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

కురవి: మండల కేంద్రంలోని పెట్రోల్‌బంక్ సమీపంలో ప్రమాదవశాత్తు బైక్‌ను, కారు ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కురవి మండలం మోద్గులగుడెం గ్రామానికి చెందిన గండు శ్రీరాములు అనే వ్యక్తి, మహబూబాబాద్ నుంచి కురవి వైపునకు బైక్‌పై వస్తున్నాడు. ఈక్రమంలో పెట్రోల్ బంక్ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తున్న విషయాన్ని గమనించిన శ్రీరాములు బైక్‌ను ఒక్కసారిగా వెనక్కి తిప్పాడు. ఈ క్రమంలో మహబూబాబాద్ నుంచి వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో వెంటనే పోలీసులు క్షతగాత్రున్ని మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి



సదానందం (ఫైల్)

కేసముద్రం: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగిన ఓ రైతు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుండ్రపెల్లి సదానందం(49) అనే రైతు తనకున్న రెండెకరాల భూమిని సాగు చేసుకుంటున్నాడు. ఆశించినంతగా దిగుబడి రాలేదు. ఈ క్రమంలో గత రెండేళ్ల క్రితం పెద్దకూతురు పెళ్లి చేశాడు. అప్పటికే చేసిన అప్పులతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ వచ్చాడు. ఈక్రమంలో తీవ్రమనస్థాపానికి గురైన సదానందం ఆదివారం తన పంటపొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య స్వరూప, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కాగా మృతుడి తండ్రి శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

కేసు నమోదు

గార్ల: కాపుసారా విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేసి, ఆమె వద్ద నుంచి 12 లీటర్ల కాపుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బానోత్ వెంకన్న సోమవారం వెల్లడించారు. వివరాలిలావున్నాయి. మండలంలోని అంజనాపురం గ్రామానికి చెందిన బానోత్ పద్మ టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై గార్లలో కాపుసారా విక్రయించేందుకు వస్తుండగా స్థానిక నిర్మలా హైస్కూల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా 12లీటర్ల సారాతో పద్మ పోలీసులకు పట్టుబడింది. ఈమేరకు ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘హాకా’ చైర్మన్‌ను కలిసిన నాయకులు



మరిపెడ రూరల్: హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్ (హాకా) చైర్మన్‌గా మరిపెడ మండలం బుర్హాన్‌పురం సర్పంచ్, ప్రముఖ వ్యాపారి మచ్చ శ్రీనివాస్ ఇటీవల నియమితులయ్యాడు. ఈసందర్భంగా శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లోని హాకా కార్యాలయంలో మరిపెడ బీఆర్ఎస్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండల నాయకుడు అజ్మీర రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రవిగౌడ్, రిటైర్డ్ ట్రైఫెడ్ అధికారి కోబాల్, కృష్ణ, నరేందర్ పాల్గొన్నారు.

కేసముద్రం: శ్రీనివాసరావును కేసముద్రం మార్కెట్ మాజీ చైర్మన్ మర్రి నారాయణరావు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.